క్లుప్తంగా

పేద విద్యార్థులకు సువర్ణావకాశం

ప్రత్యేక అధికారి ఇమ్రానాబేగం



ఇమ్రానా బేగం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల(యూఆర్ఎస్)లో అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని ప్రత్యేక అధికారి ఇమ్రానా బేగం తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ యూఆర్ఎస్ పాఠశాలలో 4వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధించనున్నట్లు తెలిపారు. బాలకార్మికులు, మధ్యలో చదువు నిలిపివేసినవారు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత వసతితోపాటు విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని పేద కుటుంబాలకు చెందిన బాలురు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 96407 63713, 99499 54247 సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్ల పరిశీలన



రాయచూర్ మార్కెట్ వద్ద కమిటీ సభ్యులు

హుస్నాబాద్: రాష్ట్రంలోని పలు వ్యవసాయ మార్కెట్ యార్డులను శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు సందర్శించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, మహబూబ్‌నగర్, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ వ్యవసాయ మార్కెట్లను పరిశీలించారు. మార్కెట్ యార్డులకు వచ్చే ఉత్పత్తులు, క్రయ విక్రయాలు, బోనస్, రైతులకు కల్పించిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ చందు, సూపర్‌వైజర్ గంగారాం, డైరెక్టర్లు శ్రీనివాస్, బాలయ్య, యాదవరెడ్డి, కుదుబుద్దిన్, పరశురాములు గౌడ్, కరెంట్ రవి, త్రిమూర్తి పాల్గొన్నారు.

సమష్టి కృషితో టీబీ నిర్మూలన



వైద్య పరీక్షలు చేస్తున్న శివ కిషోర్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): టీబీ నిర్మూలనకు కలసికట్టుగా కృషి చేయాలని ఎంఎల్‌హెచ్‌పీ శివ కిషోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నర్మెటలో టీబీపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజు, హెచ్ఈఓ స్వామి, లింగం, మంజుల, పంచాయతీ కార్యదర్శి సురేశ్‌రెడ్డి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా ఉంటా..



ఓదారుస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: పార్టీకి కార్యకర్తలు చేసిన సేవలు మరువలేనివని, వారికి ఎప్పుడూ అండగా ఉంటామని ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుబ్బాకకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు తోట్ల చంద్రయ్య గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకుని శుక్రవారం అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధర్మాజీపేట వార్డుకు చెందిన కార్యకర్త గట్టు శ్రీకాంత్‌ను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజనీర్ రామచంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ, అర్బన్, రూరల్ మండలాలలోని అన్ని గ్రామాలతో పాటు నారాయణరావుపేట మండలంలోని లక్ష్మీదేవిపల్లి, బంజరుపల్లి, కోదాండరాంపల్లి గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి, పొన్నాల ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, మందపల్లి, పొన్నాల, కిష్టసాగర్, బట్టిరామన్నపల్లి, నాంచారుపల్లి, బక్రిచెప్యాల గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు రక్షణ కరువు

- పాఠశాలలో పాములు హల్‌చల్
- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- ప్రహరీలేక ఇబ్బందులు



పాము ఉన్న గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

దుబ్బాకటౌన్: పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు తిరిగి పాఠశాల బాట పట్టారు. ఉపాధ్యాయులు సైతం వారికి ఘనంగా స్వాగతం పలికారు. కానీ దుబ్బాక నియోజకవర్గంలో పాఠశాలల్లో అక్కడ అక్కడ పాఠశాలలకు రక్షణ గోడలు, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భయపెట్టిన పాము

నియోజకవర్గంలోని రాయపోల్ మండలం ఉదయపూర్ ప్రాథమిక పాఠశాలకు పాముల బెడద ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజే పాఠశాలలో పాము దర్శనమిచ్చింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయుడు భయభ్రాంతులయ్యారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పక్కనే వ్యవసాయ పొలాలు నుంచి నేరుగా పాఠశాలలోకి పాములు వస్తున్నాయి. పాఠశాలలో అంగన్‌వాడీ సెంటర్ సైతం కొనసాగడంతో అక్కడికి వచ్చే గర్భిణులు, పిల్లలు తీవ్రంగా భయపడుతున్నారు.

ఒకే ఒక్క ఉపాధ్యాయుడు

పాఠశాలలో 13 మంది విద్యార్థులకు ఒకే ఒక ఉపాధ్యాయుడు 5వ తరగతి వరకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఆ ఉపాధ్యాయుడు అత్యవసర సమయంలో సెలవు పెడితే విద్యార్థులకు ఎవరు బోధిస్తారని ప్రశ్నిస్తున్నారు. తరగతులకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించి అధికారులు విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం



వ్యవసాయ పొలాల మధ్యలో పాఠశాల ఉండడం వల్ల పాఠశాలలోకి పాముల వస్తున్నాయి. వీలైనంత త్వరగా ప్రహరీ గోడ నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. మరొక ఉపాధ్యాయుడిని కూడా నియమించాలని వారి దృష్టికి తీసుకువెళ్లాం.

– సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ, రాయపోల్

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

పాఠశాలలో పాముల హల్‌చల్ చేయడంతో తమ పిల్లలకు రక్షణ కరువైందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా పలుమార్లు పాఠశాలలో పాముల వచ్చినా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

గురువారెడ్డి సేవలు మరువలేనివి



గురువారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రాంతంలో లక్షలాది మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఎడ్ల గురువారెడ్డి కృషి మరువలేనిదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సిద్దిపేట తొలి శాసన సభ్యుడు గురువారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాపయ్య, కార్యదర్శి డాక్టర్ నందిని సిద్ధారెడ్డి తదితరులు మాట్లాడారు. డిగ్రీ కళాశాల వ్యవస్థాపక సభ్యుడిగా, సిద్దిపేట తొలి శాసన సభ్యుడిగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. చదువు విలువ తెలిసిన వారు కాబట్టే సిద్దిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపనలో కీలక పాత్ర పోషించారని, ఎంతోమంది విద్యావంతులు కావడానికి కారణమయ్యారని ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ గురువారెడ్డి ఆదర్శమూర్తి అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెంకటరామిరెడ్డి, రామచందర్‌రావు, ఆచార్యులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ గోపాలసుదర్శనం, పిట్ల దాసు, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో విలువ



ఇంటింట ప్రచారంలో ఉమర్ సుల్తాన, అధ్యాపకులు

ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుల్తాన

దుబ్బాకటౌన్: విద్య ద్వారానే సమాజంలో ఉన్నత విలువ, గౌరవం సాధ్యమవుతుందని సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. రాయపోల్ మండల కేంద్రం, కృష్ణసాగర్ గ్రామాలలో ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌ల కోసం అధ్యాపకులు డా.కొరివి వినయకళ, డా.ఆర్.సుహాసినితో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో పేదరికం అసమానతలు తొలగిపోవడానికి విద్య ఎంతో తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి గురుకులాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ కళాశాలలో చేరితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ అన్నారు. పట్టణంలో ఇంటింటికి తిరిగి కొందరు విద్యార్థులను కళాశాలలో చేర్పించారు. తమ విద్యార్థులు కూడా స్టేట్‌ర్యాంక్‌లు సాధిస్తున్నారని చెప్పారు. లెక్చరర్లు బండారి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

ఎంఈఓ రాజిరెడ్డి

సిద్దిపేటరూరల్: తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారికి నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి రాజిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని రాఘవాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజిరెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు మంచి విద్యను బోధించేందుకు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి, హెచ్ఎం మంజుభార్గవి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని మోతె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసంతో పాటు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మోతె తార, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మమత, ప్రధానోపాధ్యాయుడు అబ్రహం, ఉపాధ్యాయులు హరికృష్ణ, మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రమ, స్వరూప, రాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం లేక పాఠశాలకు దూరం

మద్దూరు(హుస్నాబాద్): రోడ్డు సౌకర్యం లేకనే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేక పోతున్నామని ఉప్పరోనిగడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. రేబర్తి ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రభాను ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఉప్పరోనిగడ్డలో ఇంటింట ప్రచారం చేశారు. దీంతో అక్కడి తల్లిదండ్రులు మాట్లాడుతూ రవాణా, వాహన సౌకర్యం లేకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలలకు పంపించలేకపోతున్నామన్నారు. నాయకులు, అధికారులు ఎన్నో హామీలు ఇచ్చినా రోడ్డుకు మాత్రం మోక్షం కలగలేదని వాపోయారు. అయితే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హెచ్ఎం తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, రవి, చంద్రారెడ్డి, మల్లేశం, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

మద్దూరు(హుస్నాబాద్): కొత్త పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు వానాకాలం రైతు భరోసాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 20లోగా దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఏఈఓలను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితం

మెదక్ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమని మెదక్ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని జీపీపీ ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో మొక్క నాటారు. రికార్డులను పరిశీలించి, ఉద్యోగులకు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతున్నారన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత బస్సులలో ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అండర్ 19 జట్టు ఎంపిక

సిద్దిపేటజోన్: అండర్ 19 జిల్లా క్రికెట్ జట్టు సభ్యుల ఎంపిక కార్యక్రమం శనివారం ఉంటుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్ తెలిపారు. సిద్దిపేట స్టేడియంలో శనివారం ఉదయం 9గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు యూనిఫారం, క్రికెట్ కిట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

కౌంటర్లు ఏర్పాటు చేయండి

హుస్నాబాద్: భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. రెవెన్యూ సదస్సులలో ఫిర్యాదులు చేయలేని రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, వారికోసం ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయ కమాను ప్రారంభం

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయం వద్ద రామసాగరం గ్రామానికి చెందిన అంబీరు నరేశ్, లావణ్య దంపతులు రూ.10 లక్షలతో నిర్మించిన ఆలయ కమానును శుక్రవారం పూజారి శేషం మధుసూదనాచారి ప్రారంభించారు. నర్సింహ హోమం, పూర్ణాహుతి నిర్వహించి అన్నదానం చేశారు. ఆలయ కమానును సొంత డబ్బులతో నిర్మించిన భక్తులు, దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జిల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాలకు టీవీ వితరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ రాష్ట్ర నేత ప్రతాప్ రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌గుప్తా మండలంలోని ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం టీవీ వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్, నేతలు ఉపేందర్‌రెడ్డి, రంగారెడ్డి, కనకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ మైక్ సిస్టమ్ అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): పూర్వ విద్యార్థులు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మైక్ సిస్టమ్‌ను అందించారు. ఆ పాఠశాలలో చదువుకున్న 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు సేవ చేయాలన్న సంకల్పంతో మైక్ సిస్టమ్‌ను అందించారు. పూర్వ విద్యార్థులు శ్రీధర్‌శర్మ, నాగిరెడ్డి, మాధవరెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఓబులాపూర్, గోనెపల్లి గ్రామాల విద్యార్థుల కోసం సిద్దిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిపోలో అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాల మీదుగా కళాశాలలకు అనుగుణంగా బస్సులు నడపాలని అధికారులను కోరారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి బస్సులు నడపాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు కమలాకర్‌చారి తదితరులు ఉన్నారు.

◆ యాదవులకు మోసం

చిన్నకోడూరు(సిద్దిపేట): గొర్రెల పంపిణీ పేరుతో బీఆర్ఎస్ పార్టీ యాదవులను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యాదవులు విద్యావంతులైతే ఎదురు తిరిగి ప్రశ్నిస్తారనే ఉద్దేశ్యంతో గొర్రెలు కాసుకోవాలని గొర్రెల పంపిణీ చేపట్టారన్నారు. పరశురాములు, గణేశ్, జయంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

◆ మృతుడి కుటుంబానికి సాయం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్‌లో అనారోగ్యంతో మరణించిన పోశవేని మీనయ్య కుటుంబానికి శుక్రవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో ఎవరు మరణించినా దహన సంస్కారాలకు కమిటీ చేయూత అందిస్తుంది.

తొలిమెట్టు అక్షరాభ్యాసం



హుస్నాబాద్: అక్షరాలు దిద్దిస్తున్న ఉపాధ్యాయులు



కొడకండ్లలో సామూహిక అక్షరాభ్యాసం

హుస్నాబాద్: అక్షరాభ్యాసం విద్యార్థుల చదువుకు తొలిమెట్టు అని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వాసుదేవరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. సరస్వతి పూజచేసి విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల తొలిరోజే 20 మంది అడ్మిషన్లు తీసుకోవడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందజేస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సదుపాయాలను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లింగం నాయక్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: చదువుల్లో రాణించి ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని కొడకండ్లలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో అత్యంత కీలకమైన ఘట్టం అక్షరాభ్యాసమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహేల, కల్పన, సాధన, అంగన్‌వాడీ టీచర్ రమ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య ఎంతో కీలకం

కొండపాక(గజ్వేల్): ప్రాథమిక విద్య ఎంతో కీలకమైందని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుద్దెడ హైస్కూల్లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుందన్నారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి అదనపు భారాన్ని నెత్తిన వేసుకోవద్దని తల్లిదండ్రులను కోరారు. మాజీ సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించాలని ఎంఈఓ గజ్జెల కనకరాజు సూచించారు. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, భాను ప్రకాశ్, కరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పద్మనాభునిపల్లిలో..

దుబ్బాకరూరల్: మండలంలోని పద్మనాభునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ ప్రభుదాస్ విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు అనుభవంలేని ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్



విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా ఏఎంఓ భాస్కర్

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్ అన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే 25 మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు కృషి చేశారు. అనంతరం భాస్కర్‌తో పాటు ఎంఈఓ సత్తయ్య, ఎంపీడీఓ రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్తయ్య, ఉపాధ్యాయులు రాంచంద్రం, స్వరూపారాణి, శంకరయ్య, నాగరాణి, ప్రియ, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్



దుబ్బాకటౌన్: తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్

దుబ్బాకటౌన్: వార్డుల్లో స్వచ్ఛతతోపాటు ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 16, 19వ వార్డుల్లో 100 రోజులు – 50 కార్యక్రమాలు అనే బృహత్ ప్రణాళికలో భాగంగా వార్డు ప్రజలకు తడి, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా లాంటి రోగాలు ప్రబలకుండా నీరు నిలిచిన ప్రాంతాలు, మురుగు కాలువల్లో దోమల మందు పిచికారీ చేసి వాటర్ బాల్స్ వేశారు. అనంతరం కార్యాలయంలో వార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని వార్డుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు వార్డుల్లో పర్యటించి, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సహకరించండి

హుస్నాబాద్: స్వచ్ఛ హుస్నాబాద్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. 100 రోజుల కార్యక్రమ కార్యచరణలో భాగంగా పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్, బ్లీచింగ్, స్ప్రే చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కూలర్లు, పారేసిన కొబ్బరి బొండాలు, ఇతర పాత్రల్లో నీటి నిల్వలను తొలగించాలన్నారు. తడిచెత్తతో ఇంటిలోనే ఎరువు తయారు చేసుకోవాలని, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు అధికారులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం పీపీఈ కిట్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

మంత్రిని కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్



మంత్రి లక్ష్మణ్‌కు మొక్కను అందజేస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): మంత్రి వర్గ విస్తరణలో షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమశాఖ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రిగా నియామకమైన అడ్లూరి లక్ష్మణ్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కమిషన్ సభ్యురాలు నీలాదేవి, సభ్యులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, రాంబాబు నాయక్, శంకర్, సామ్రాట్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మద్దూరు(హుస్నాబాద్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైరాన్‌పల్లి పల్లె దవఖాన డాక్టర్ స్టువర్ట్‌సన్ సూచించారు. ధూళ్మిట్ట మండల పరిధిలోని బైరాన్‌పల్లిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం డాక్టర్ స్టువర్ట్‌సన్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రోస్లిన్, ఏఎన్ఎం రత్నకుమారి, హెచ్ఏ దేవదాసు, ఎల్‌టీ రాజేందర్, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.